ప్రతి ఒక్కరికీ వైద్య సేవలు అందాలి



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మాజీ కార్పొరేటర్‌ నర్సింహ

బోడుప్పల్‌: ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్య సేవలు అందాలని 28వ డివిజన్‌ మాజీ కార్పొరేటర్‌ చీరాల నర్సింహ అన్నారు. బోడుప్పల్‌ ఎస్సీ బస్తీలో ఆదివారం అనఘా హాస్పిటల్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై పరీక్షలు చేయించుకున్నారు. వైద్యులు పలువురికి పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంబేడ్కర్‌ సంఘం అధ్యక్షులు రాపోలు ఉపేందర్‌, చిన్నింగల్ల మహేష్‌, చిన్నింగల్ల శ్రీకాంత్‌, డాక్టర్లు భవాని, శ్రీష్టి పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న అరుంధతి ఆస్పత్రి వైద్యులు

అల్వాల్‌: మచ్చబొల్లారం మార్కెట్‌ వద్ద అరుందతి ఆస్పత్రి సహకారంతో సురేష్‌ సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. ఉత్తమ సేవారత్న అవార్డు గ్రహీత, బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నాయకుడు నర్ల సురేష్‌ మాట్లాడుతూ ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. నాయకులు సురేందర్‌రెడ్డి, పరమేష్‌, అతిక్‌, జావిద్‌, మహేష్‌, వినయ్‌, రాజు, రాజేష్‌, మధుసూదన్‌రెడ్డి, శ్రీను, సందీప్‌రెడ్డి, సతీష్‌, బషీరుద్దీన్‌ తదితరులు పాల్గొన్నారు.

త్యాగరాజ ఆరాధనోత్సవాలు



ఉప్పల్‌: ఉప్పల్‌ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన త్యాగరాజ ఆరాధనోత్సవాలు అలరించాయి. వాగ్దేవి సంగీత విద్యాలయం గురువులు తాడేపల్లి సుబ్బలక్ష్మీ ఆధ్వర్యంలో త్యాగరాజ ఆరాధన ఉత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో సంగీత కళాకారులు సరిత, పద్మ, హైమావతి, శృతి, జనార్దన్‌, శ్రీకర్‌, మౌక్తిక, శ్రీనివాస్‌ తదితరులు త్యాగరాజ కీర్తనలను ఆలపించారు.

గ్రీన్‌ ఫీల్డ్‌ ఫ్లాట్‌ ఓనర్స్‌ నూతన కమిటీ

అధ్యక్షుడిగా జ్ఞానేశ్వర్‌ ఏకగ్రీవ ఎన్నిక



అల్వాల్‌: కానాజీగూడ గ్రీన్‌ ఫీల్డ్‌ ఫ్లాట్‌ ఓనర్స్‌ అసోసియేషన్‌ ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. అధ్యక్షుడిగా జ్ఞానేశ్వర్‌ ఏకగ్రీవంగా ఎన్నిక కాగా ప్రధాన కార్యదర్శిగా కంచర్ల శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా వీఎస్‌రావు రామరాజు, సంయుక్త కార్యదర్శిగా వి.రమణమూర్తి, కోశాధికారిగా యడ్లపల్లి సదాశివరావు, కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్‌, సత్యవతి, సత్యానారాయణ, నాగార్జునరావు, అంతయ్య ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అధ్యక్షుడు జ్ఞానేశ్వర్‌ మాట్లాడుతూ పెండింగ్‌ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, సభ్యులు సహకారం అందించాలని కోరారు.

క్రీడలతో శారీరక, మానసిక ప్రశాంతత



తైక్వాండో ట్రోఫీ అందుకుంటున్న సెజ్‌ పాఠశాల విద్యార్థులు

మేడిపల్లి: క్రీడలతో శారీరక, మానసిక ప్రశాంతత ఉంటుందని సెజ్‌ పాఠశాల ప్రిన్సిపాల్‌ సీతామహాలక్ష్మి అన్నారు. సెజ్‌ పాఠశాలలో మాస్టర్‌ చరణ్‌ ఆధ్వర్యంలో ఆదివారం తైక్వాండో టోర్నమెంట్‌ను ఘనంగా నిర్వహించారు. గెలుపొందిన వారికి సెజ్‌ పాఠశాల ప్రిన్సిపాల్‌ సీతామహాలక్ష్మి, వైస్‌ ప్రిన్సిపాల్‌ చైత్ర, ఆక్స్‌ఫర్డ్‌ పాఠశాల ప్రిన్సిపాల్‌ గీత, రిపోర్టర్‌ రాజ్‌కుమార్‌ మెడల్స్‌ను అందజేశారు. 10 పాఠశాలల నుంచి సుమారు 200మంది విద్యార్థులు పాల్గొన్నారని పాఠశాల యాజమాన్యం తెలిపింది. తైక్వాండో మేడ్చల్‌ జిల్లా అధ్యక్షుడు సుధీర్‌, పలువురు మాస్టర్లు తదితరులు పాల్గొన్నారు.

భయం భయం.. ఈ రోడ్డుపై ప్రయాణం



చెంగిచెర్ల ప్రధాన రహదారి పేరు చెబితే వామ్మో అనే పరిస్థితి.. 24 గంటల పాటు వాహనాల రాకపోకలతో కిక్కిరిపోయేది.. చర్లపల్లి ప్రాంతంలోని చమురు సంస్థలకు చెందిన వందలాది ఆయిల్‌ ట్యాంకర్లు ఓ వైపు.. చెంగిచర్లలోని స్లాటర్‌ హౌస్‌కు రాకపోకలు సాగించే వాహనాలు మరోవైపు.. నిత్యం ట్రాఫిక్‌తో నిండిపోయే రోడ్డుపై నిత్యం ప్రమాదాలు జరిగేవి. ఎంతో మంది ప్రాణాలు సైతం కోల్పోయారు. దాంతో 2018 సంవత్సరంలో రోడ్డు వెడల్పు పనులకు టెండర్లు పిలిచి 2020లో పనులు ప్రారంభించారు. దీంతో స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగించే వారు హమ్మయ్య.. అంటూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే.. పనులు అసంపూర్తిగా నిలిచి పోవడంతో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నారు. – బోడుప్పల్‌

ప్రమాదకరంగా చెంగిచర్ల ప్రధాన రహదారి

- మధ్యలో నిలిచిపోయిన రోడ్డు పనులు
- ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్న ప్రజలు
- రోడ్డు పక్కనే వాహనాల పార్కింగ్‌
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు

వివిధ ప్రాంతాల నుంచి చమురు సంస్థలకు చెందిన ట్యాంకర్లు వరంగల్‌ జాతీయ రహదారి నుంచి చెంగిచెర్ల మీదుగా చెర్లపల్లిలోని చమురు సంస్థలకు రాకపోకలు సాగించేవి. చెంగిచెర్లలోని స్లాటర్‌ హౌజ్‌కు సైతం పెద్దఎత్తున వాహనాల రాకపోకలు ఉండటంతో నిత్యం ఆ ప్రాంతమంతా ట్రాఫిక్‌తో కిక్కిరిపోయేది. భవిష్యత్‌లో ట్రాఫిక్‌ సమస్యకు చెక్‌ పెట్టేందుకు 40 ఫీట్ల రోడ్డును కాస్తా 100 ఫీట్ల వెడల్పు పనులు చేపట్టేందుకు అప్పటి బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మల్లాపూర్‌ ఎన్‌ఎఫ్‌సీ నుంచి చెంగిచర్ల మీదుగా మేడిపల్లి చౌరస్తా వరకు హైదరాబాద్‌ రోడ్డు డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ లిమిటెడ్‌(హెచ్‌ఆర్‌డిసిఎల్‌) ఆధ్వర్యంలో 2018 సంవత్సరం జనవరి 31వ తేదీన టెండర్లు పిలిచింది. కాంట్రాక్టర్‌ 2020లో పనులను ప్రారంభించాడు. రోడ్డు మధ్యలో ఆరు అడుగుల డివైడర్‌ ఏర్పాటు కోసం స్థలం కూడా వదిలారు. రోడ్డుకు ఒకవైపు పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌ నిధుల లేమి కారణంగా పనులను మధ్యలోనే నిలిపేశాడు. దీంతో ఆ రోడ్డు ఒకచోట ఎత్తుగా.. మరో చోట పల్లంగా ఉండటంతో వేగంగా వచ్చే వాహనాలు అదుపు తప్పి కింద పడుతున్నాయి.



అసంపూర్తి రోడ్డుతో ప్రమాదాలు

మేడిపల్లి నుంచి చర్లపల్లి ఐఓసీ, చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఐఓసీకి ప్రతిరోజూ వందలాది ఆయిల్‌ ట్యాంకర్లు రాకపోకలు సాగిస్తుంటాయి. అంతేగాకుండా చెంగిచర్లలో స్లాటర్‌ హౌజ్‌లో పనిచేసే సిబ్బంది, మాంసం దుకాణదారులు, కొనుగోలుదారులు రాకపోకలు సాగిస్తున్నారు. ఒక వైపు అసంపూర్తి రోడ్డు, వాహనాల పార్కింగ్‌ వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చెంగిచర్ల ప్రధాన రహదారిపై రాకపోకలు సాగించాలంటే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు.

మిగిలిపోయిన పనులను పూర్తి చేయాలి



ప్రస్తుత కాంగ్రెస్‌ పార్టీ ప్రభుత్వం చొరవ తీసుకుని మిగిలిపోయిన పనులను పూర్తి చేయాలి. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులకు, స్లాటర్‌ హౌస్‌కు వచ్చే ఉద్యోగులు, సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో వేసిన రోడ్డు మధ్యలో కొన్ని చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా స్థానిక కాంగ్రెస్‌ పార్టీ నాయకులు చొరవ తీసుకుని రోడ్డు పనులను పూర్తి చేయాలి.

– కొత్త ప్రశాంత్‌గౌడ్‌, చెంగిచర్ల నివాసి

బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్‌ నాయకులు

కుషాయిగూడ: మీర్‌పేట్‌–హెచ్‌బీకాలనీ డివిజన్‌కు చెందిన బీఆర్‌ఎస్‌ నాయకులు బీజేపీలో చేరారు. బీజేపీ డివిజన్‌ అధ్యక్షుడు మునుగంటి రాంప్రదీప్‌ ఆధ్వర్యంలో ఎంపీ ఈటల రాజేందర్‌ సమక్షంలో బీఆర్‌ఎస్‌ హెచ్‌బీకాలనీ డివిజన్‌ మాజీ అధ్యక్షుడు నవీన్‌, బీఆర్‌ఎస్‌ యూత్‌ అధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్‌ బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్‌ మాట్లాడుతూ రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.



ఈటల సమక్షంలో బీజేపీలో చేరుతున్న బీఆర్‌ఎస్‌ నాయకులు

ఉత్సాహంగా సైకిల్‌ మారథాన్‌



కాప్రా: కుషాయిగూడలోని ఎస్‌ఎస్‌ఐసీ బిజినెస్‌ పార్క్‌లో గెయిల్‌ ఆధ్వర్యంలో ఆదివారం సైక్లోథాన్‌ సైకిల్‌ మారథాన్‌ను నిర్వహించారు. ముఖ్య అతిథిగా గెయిల్‌ చీఫ్‌ జనరల్‌ మేనేజర్‌ దేవకాంత్‌ సిన్హా హాజరై ర్యాలీని ప్రారంభించారు. 5 కిలో మీటర్లు సైకిల్‌ ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా దేవకాంత్‌ సిన్హా మాట్లాడుతూ.. సైకిల్‌ యాత్ర ఆయిల్‌ కన్జర్వేషన్‌ కోసం చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ భవిష్యత్‌ తరాల కోసం గ్యాస్‌, ఆయిల్‌ తదితర ఇంధనాన్ని ఆదా చేయాలని కోరారు.

దివ్యాంగ విద్యార్థులకు సాయం అందిస్తాం

అల్వాల్‌: ప్రభుత్వం సహకారం అందిస్తే రాష్ట్రంలో దివ్యాంగులైన ప్రతి విద్యార్థికి విద్యా, వైద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధిలో ముందుడే విధంగా యు వార్డు ద్వారా సాయం అందిస్తామని హెలెన్‌ కెల్లర్‌ ఇనిస్టిట్యూట్‌ ఫౌండర్‌ చైర్మన్‌ లయన్‌ పఠాన్‌ ఉమర్‌ఖాన్‌ అన్నారు. నేరేడ్‌మెట్‌ డివిజన్‌ ఆర్కేపురంలోని హెలెన్‌ కెల్లర్స్‌ కళాశాలలో ఆదివారం ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన యు వార్డు చేస్తున్న ముఖ్యమైన సర్వీస్‌ యాక్టివిటీని వివరించారు. కార్యక్రమానికి చార్టెడ్‌ అకౌంటెంట్‌ మిర్జా మజహర్‌, హైకోర్టు లాయర్‌ నిరంజన్‌ ప్రసాద్‌, అడికేట్‌ నటరాజ్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.



మాట్లాడుతున్న ఉమర్‌ ఖాన్‌

వైభవంగా ప్రారంభమైన రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవం



అల్వాల్‌: పురాతనమైన శ్రీసీతారామ చంద్ర స్వామి దేవస్థానం పాత అల్వాల్‌లో దేవాలయ రాజగోపుర ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం సాయంత్రం అంకురార్పణతో ప్రారంభమైంది. బుధవారం వరకు ప్రతిష్ఠ మహోత్సవం ఉంటుందని, త్రిదండి రామానుజ చినజీయర్‌ స్వామి చేతులమీదుగా రాజగోపుర ప్రతిష్ఠ ఉంటుంది నిర్వాహకులు తెలిపారు. యజ్ఞాచార్యులు లక్ష్మణాచార్యులు, ఆలయ ట్రస్ట్‌ సభ్యులు పరంధామ రంగారావు, నాగన్న, తిరుపతిరావు, సీతారామరావు, చలపతి రావు, చంద్ర ప్రకాష్‌రావు, గోపికృష్ణ ఉన్నారు.

వాటర్‌ డెవలప్‌మెంట్‌ సొసైటీ ప్రతినిధులకు త్వరలో బెనిఫిట్స్‌

గౌతంనగర్‌: వాటర్‌ డెవలప్‌మెంట్‌ సొసైటీ ప్రతినిధులతో కలిసి 30 ఏళ్ల నుంచి చేస్తున్న పోరాటం కొలిక్కి వచ్చిందని, త్వరలోనే వాటర్‌ డెవలప్‌మెంట్‌ సొసైటీ సభ్యురాలకు రావాల్సిన బెనిఫిట్స్‌ త్వరలోనే అందుతాయని చైర్మన్‌ మీనా అన్నారు. గౌతంనర్‌లోని కాలనీ సంక్షేమ సంఘం భవనంలో వాటర్‌ డెవలప్‌మెంట్‌ సొసైటీ సభ్యులతో ఆదివారం ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాటర్‌ డెవలప్‌మెంట్‌ సొసైటీ పని ముగిసిందని ఎంతో మంది అన్నారని, వెనుకడుగు వేయకుండా సొసైటీలోని కొంత మంది సభ్యుల సహకారంతో కోర్టుకు వెళ్లి హక్కులు సాధించుకున్నామని తెలిపారు. కేంద్ర ఆసరా కమిటీ ప్రధాన కార్యదర్శి కందిబండ సత్యానారాయణ మాట్లాడుతూ వాటర్‌ డెవలప్‌మెంట్‌ సొసైటీ ఉద్యోగులకు సరైన న్యాయం జరగలేదని కోర్టుకు వెళ్లి వారి హక్కులను సాధించుకునేలా కృషి చేసిన చైర్మన్‌ మీనాకు అభినందనలు తెలిపారు.



శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామికి ప్రత్యేక పూజలు

బోడుప్పల్‌: ప్రజలు ఆనందమైన జీవితం గడిపేందుకు కృషి చేయాలని శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయం ప్రధాన కార్యదర్శి రాసాల నర్సింగ్‌రావు అన్నారు. బోడుప్పల్‌లోని శ్రీభ్రమరాంబ సహిత మల్లికార్జున స్వామి ఆలయ 27వ బ్రహ్మోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీపాక సుదీక్ష, శ్రీనివాస్‌యాదవ్‌ దంపతులచే శ్రీమల్లిఖార్జున స్వామి వారి కళ్యాణ మహోత్సవం, జడిగె లక్ష్మి, రమేష్‌యాదవ్‌ దంపతులచే రేణుకా ఎల్లమ్మ కళ్యాణం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన ప్రత్యేక పూజలో యాదవ్‌ సంఘం అధ్యక్షుడు తోటకూర రవీందర్‌ యాదవ్‌, ప్రధాన కార్యదర్శి జనిగె వెంకటేశ్‌ యాదవ్‌, భక్తులు పాల్గొన్నారు.



పూజల్లో నర్సింగ్‌రావు తదితరులు

విద్యార్థి యువ గర్జన సభ వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో మంగళవారం నిర్వహించతలపెట్టిన విద్యార్థి, యువజన గర్జన సభను వాయిదా వేసినట్లు తెలంగాణ మాల ఫెడరేషన్‌ రాష్ట్ర అధ్యక్షులు చెనేని వెంకట్‌ ఆదివారం తెలిపారు. ఎస్సీ వర్గీకరణ జస్టిస్‌ షమీమ్‌ అక్తర్‌ ఏకసభ్య కమిషన్‌ మార్చి 10 వరకు పొడిగించినందున సభను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. మార్చి 3న మాల విద్యార్థి, యువకులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి భవిష్యత్తు కార్యచరణను ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



మందులు అందజేస్తున్న కాంగ్రెస్‌ నేత నరేందర్‌

కుషాయిగూడ: పేద ప్రజల కోసం ఏర్పాటు చేసే ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్‌ పార్టీ సీనియర్‌ నేత కొత్తపల్లి నరేందర్‌ అన్నారు. మంగాపురం, సాయిబాబా ఆలయంలో కిమ్స్‌ ఆస్పత్రి సహకారంతో ఆదివారం ఆయన ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కిమ్స్‌ వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సామాజిక భావనతోనే సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు నరేందర్‌ తెలిపారు. కార్యక్రమంలో అశోక్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్‌గౌడ్‌, శ్రీనివాస్‌, దినేష్‌, రాజేష్‌, ఆకాశ్‌, కిషోర్‌, రాజయ్య, మల్లికార్జున్‌, మహేందర్‌, తరుణ్‌ తదితరులు పాల్గొన్నారు.

మచ్చబొల్లారంలో మౌలిక వసతుల కల్పనకు కృషి

అల్వాల్‌: మచ్చబొల్లారం డివిజన్‌ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నానని స్థానిక కార్పొరేటర్‌ రాజ్‌ జితేంద్రనాథ్‌ అన్నారు. డివిజన్‌ పరిధిలోని కౌకూర్‌, పంచశీల కాలనీ, ధరణీ ఎన్‌క్లేవ్‌ కాలనీలవాసులు ఆదివారం కార్పొరేటర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయా కాలనీల్లో రోడ్ల మరమ్మతులు, తాగునీటి సమస్య, వీధి దీపాల ఏర్పాటు వంటి సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్‌ దృష్టికి తీసుకెళ్లారు. ఆయ శాఖల అధికారులకు చెప్పి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. నరేష్‌ మిట్టల్‌, బస్వరాజు, విజయ్‌వర్ధన్‌రెడ్డి, చంద్రయ్య, దేవేందర్‌, రవిభూషన్‌, వెంకట్‌, కృష్ణరెడ్డి పాల్గొన్నారు.



కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

బోడుప్పల్‌: బోడుప్పల్‌ ప్రభుత్వ పాఠశాల 2001–2002 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించారు. పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని గత స్మృతులను నెమరు వేసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని ఉన్నత స్థితిలో ఉన్న మాజీ విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులను జ్ఞాపికలతో సత్కరించారు. ఉపాధ్యాయులు క్రిష్టయ్య, సుందరం, కూర్కు రత్నం, కంచుకట్ల శ్రీనివాస్‌, ప్రతిభరాణి, శైలజ, చంద్రశేఖర్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు సమంత, మల్లిఖార్జున్‌, ప్రదీప్‌, మహాలక్ష్మి, వేణు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

నేడు కరెంట్‌ ఉండని ప్రాంతాలు



బోడుప్పల్‌: సమ్మర్‌ యాక్షన్‌ ప్లాన్‌ నిమిత్తం ఇందిరానగర్‌ ఫీడర్‌ పరిధిలో సోమవారం పలు కాలనీల్లో విద్యుత్‌ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వేణుగోపాల్‌ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు శ్రీసాయి భవాని కాలనీ, సాయిరాం నగర్‌ కాలనీ, శ్రీనివాస్‌ కాలనీ, ఎస్సీ బస్తీ, ఆనందనగర్‌, బొమ్మక్‌ బ్రదర్స్‌ కాలనీ, బృందావన్‌ కాలనీ, ఈస్ట్‌ హనుమాన్‌నగర్‌, వెస్ట్‌ హనుమాన్‌నగర్‌, సత్తిరెడ్డి కాలనీ, వెస్ట్‌ బృందావన్‌ కాలనీల్లో విద్యుత్‌ సరఫరా ఉండదన్నారు.

మేడిపల్లి: 11కేవీ వెంకటసాయి నగర్‌ ఫీడర్‌ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా 33/11కేవి చెంగిచెర్ల సబ్‌స్టేషన్‌ పరిధిలో సోమవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సాయి రెసిడెన్సీ, వెంకటసాయినగర్‌, కృష్ణానగర్‌, ప్రీవిలేజ్‌, దత్తాత్రేయనగర్‌ , ఎంఎల్‌ఆర్‌ కాలనీ, అక్షయ నగర్‌, శివగణేష్‌ నగర్‌లలో కరెంట్‌ ఉండదని ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు.

11కేవీ మైవిల్లాస్‌ ఫీడర్‌ పరిధిలో..

చెట్ల కొమ్మల తొలగింపు, మరమ్మతుల కారణంగా 33/11 కేవీ చెంగిచెర్ల సబ్‌ స్టేషన్‌ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అరవింద ఎన్‌క్లేవ్‌, రామకృష్ణా నగర్‌, మైవిల్లాస్‌లలో కరెంటు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ హరినాథ్‌ సగ్గు ఓ ప్రకటనలో తెలిపారు.

ఉప్పల్‌: హబ్సిగూడ పరిధిలోని ఐఎస్‌ఐ 11 కేవీ విద్యుత్‌ ఫీడర్‌ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 10.30 నుంచి 11 గంటల వరకు రవీంద్రానగర్‌ వీధి నంబర్‌–5 నుంచి 27 వరకు విద్యుత్‌ సరఫరా ఉండదని ఏఈ గణేష్‌ తెలిపారు.

హబ్సిగూడ ప్రాంతంలో..

హబ్సిగూడ: మరమ్మతుల కారణంగా హబ్సిగూడలోని కొన్ని ప్రాంతాల్లో సోమవారం కరెంటు సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ వి.గణేష్‌ ఆదివారం తెలిపారు. 11 కేవీ స్ట్రీట్‌ నంబర్‌–8 ఫీడర్‌ పరిధిలోని రవీంద్రగనర్‌ లైన్‌ నంబర్‌ 5 నుంచి 27 వరకు ఉదచం 10.30 నుంచి 11 గంటల వరకు కరెంటు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

11కేవీ భూపతిరావునగర్‌ ఫీడర్‌ పరిధిలో..

అల్వాల్‌: 11కేవీ భూపతిరావునగర్‌ ఫీడర్‌ మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు భూపతిరావునర్‌, శక్తిగణేష్‌నగర్‌, అల్వాల్‌ హిల్స్‌, కరెంట్‌ సరఫరా నిలపివేయనున్నట్లు అధికారులు తెలిపారు. హకీంపేట్‌ రిసాలబజార్‌ ఫీడర్‌ మరమ్మతుల కారణంగా 12 నుంచి 2 గంటల వరకు రిసాలబజార్‌, ప్రేమ్‌నగర్‌, జీఎస్‌ఆర్‌ ఎన్‌క్లేవ్‌, బంజారా విలేజ్‌, కుటియా మందిర్‌ ప్రాంతాల్లో కరెంట్‌ ఉండదని తెలిపారు. ఫాదర్‌ బాలయ్య ఫీడర్‌ మరమ్మతుల కారణంగా సాయంత్ర 3 నుంచి 5 గంటల వరకు ఎఫ్‌బీనగర్‌, భవానీనగర్‌, సిటిజన్‌ కాలనీ, అయ్యప్పనగర్‌, అంబేడ్కర్‌నగర్‌ తదితర ప్రాంతాల్లో కరెంట్‌ సరఫరా ఉండదని తెలిపారు.

మల్కాజిగిరి: ఆనంద్‌బాగ్‌ సబ్‌స్టేషన్‌ 11 కేవీ ఎన్‌ఎండీసీ ఫీడర్‌ పరిధిలో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కళ్యాణ్‌నగర్‌, ఎన్‌ఎండీసీ కాలనీ, ఆనంద్‌బాగ్‌ ఈస్ట్‌, బ్యాంక్‌ కాలనీ, తాళ్లబస్తీ ప్రాంతాల్లో 11 కేవీ పీబీకాలనీ ఫీడర్‌ పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పూలపల్లి బాలయ్య కాలనీ, నవభారత్‌ కాలనీ, 11 కేవీ కృపానంద్‌ ఫీడర్‌ పరిధిలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వెస్ట్‌ ఆనంద్‌బాగ్‌, కృపానంద్‌ ఏరియా, ఏడిఆర్‌ ఆస్పత్రి ఏరియా ప్రాంతాల్లో సరఫరా ఉండదని ఏఈ శ్రీనివాస్‌ తెలిపారు.